

నీలమణి దుర్గ ఉత్సవాలకు..

నీలమణి దుర్గమ్మ ఉత్సవాలకు వేళయ్యింది. రేపటి నుంచి ఉత్సవాలు మొదలు కానున్నాయి. - 10లో



ఎందుకీ నిర్లక్ష్యం..?

రిమ్స్‌లో ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిధులు ఉన్నా విధులు నిర్వహించడం లేదు. - 10లో

నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు మొదలుకానున్నాయి. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. సెలవు రోజుల్లో పాఠశాలలను తెరిచి, ప్రత్యేక క్లాసులు, స్టడీ అవర్స్ అంటూ విద్యార్థులను బడులకు రప్పిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

న్యూస్‌రీల్

15న జూడో జట్టు, వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: అండర్-19 రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొనే బాల, బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీజీ ఎస్.రామన్న తెలిపారు. పాఠశాలలో వివరాలు శుక్రవారం తెలియజేశారు. ఒప్పంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభం కానున్నాయని అన్నారు. 15న ఉదయం 10 గంటలకు నరసన్న పేట ప్రభుత్వ పాఠశాలలో అండర్ 19 బాల, బాలికల వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల బాల, బాలికలు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విపత్తులో అప్రమత్తతే ఆయుధం



ఏడురోడ్ల కూడలి వద్ద అవగాహన ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నవీన్, తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: అప్రమత్తతతోనే విపత్తులను ఎదుర్కోగలమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు అంతర్జాతీయ విపత్తుల కుదింపు దినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతిపెద్ద సముద్ర తీరం ఉందని, తుపాన్ల తాకిడి ఎదుర్కొనేందుకు శిక్షణ పొందిన ఈ బృందాలు సహకరిస్తాయని తెలిపారు. జిల్లా అగ్నిమాపక అధికారి మోహన రావు మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో నిరంతరం సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ తమ వలంటీర్ల ద్వారా విపత్తులు జరిగినపుడు, తర్వాత కూడా వివిధ దశల్లో సేవలు కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, బి.చిన్మయరావు, సమన్వయకర్త కె.సత్యనారాయణ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిబ్బంది, వలంటీర్లు, న్యూసెంట్రల్ స్కూల్, ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సిబ్బంది, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరింగ్ విద్యార్థులు, జిల్లా విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల సిబ్బంది పాల్గొన్నారు.

'రౌడీషీటర్లపై దృష్టి పెట్టండి'

శ్రీకాకుళం క్రైమ్ : రౌడీషీటర్లపై ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీటు దాఖలు చేయాలని, యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లపై దృష్టి పెట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో గ్రేవ్ కేసులు, పోలీస్ స్టేషన్ల వారీగా ఉన్న రౌడీ షీటర్ల వివరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రేవ్ కేసుల నమోదు, దర్యాప్తుపై ఎస్పీ ఆరా తీశారు. గ్రేవ్ కేసులలో సమగ్రమైన దర్యాప్తు చేపట్టి కచ్చితమైన సాక్ష్యాధారాలతో కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అదే విధంగా గంజాయి కేసుల్లో నిందితులను గుర్తించి కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు. రౌడీషీటర్లపై ఆరా తీస్తూ వారు సత్ప్రవర్తనతో నడుచుకునేలా కౌన్సిలింగ్ అధికారులు ఇవ్వాలని ఎస్పీ సూచించారు.



టైటానిక్

ఎప్పుడు తయారైంది
1912

తొలి ప్రయాణం
1912 ఏప్రిల్ 10

ఎక్కడ్నుంచి ఎక్కడికి
ఇంగ్లాండ్‌లోని సౌథాంప్టన్ నుంచి న్యూయార్క్ వెళ్తుండగా సముద్రంలో మునిగిపోయింది

నిర్మాణ సంస్థ
హర్లాండ్ అండ్ వోల్ఫ్(ఐర్లాండ్)

నౌక పొడవు: 269 మీటర్లు


వెడల్పు: 28 మీటర్లు

సామర్థ్యం: 3500 మందికి పైగా

మృత్యువాత: 1500 మందికి పైగా..



బారువ తీరంలోని సాగర గర్భంలో చిలకా నౌక వద్ద లివిన్ అడ్వెంచర్ బృందం అన్వేషణ (ఫైల్)



చిలకా..

ఎప్పుడు తయారైంది
1910

మునిగిపోయిన రోజు
1917 జూలై 01

ఎక్కడ్నుంచి ఎక్కడికి
మద్రాసు నుంచి రంగూన్

ఎక్కడ ప్రమాదానికి గురైంది
బారువ తీరంలో కొత్తూరు సమీపంలో..

ఏ కంపెనీకి చెందినది
బ్రిటీష్ ఇండియా నేవిగేషన్ కంపెనీ

నౌక పొడవు: 150 మీటర్లు

వెడల్పు: 20 మీటర్లు

ప్రమాద సమయంలో నౌకలో ఎంతమంది ఉన్నారు
1600

మృత్యువాత: 81

నౌకతో పాటే.. జాలర్ల తెగువా.. జలసమాధి!



ప్రస్తుతం బారువ తీరంలో చిలకా నౌక ఇలా...

చరిత్ర పుటల్లో చిలకా

టైటానిక్.. ఈ పేరు వింటే చాలు.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రమాదానికి గురైన నౌక అని ఎవరైనా చటుక్కున సమాధానం చెప్పేస్తారు. అదే చిలకా పేరు చెబితే అదేంటీ.. అని నోరెళ్ల బెడతారు. టైటానిక్ మాదిరిగానే చిలకా అన్నది ఒక భారీ షిప్ పేరు. ఈ రెండింటి మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయి. రెండూ భారీ ప్రయాణికుల నౌకలే. అయిదేళ్ల వ్యవధిలోనే ప్రమాదాలకు గురైనవే. వందేళ్లు గడిచినా ఇప్పటికీ సముద్ర గర్భం నుంచి బయటకు రాలేక పోయినవే. అయితే టైటానిక్ ప్రమాదానికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తే.. చిలకా దుర్ఘటన మాత్రం షిప్ మాదిరిగానే చరిత్ర గర్భంలో గుర్తింపు లేకుండా మరుగున పడిపోయింది. టైటానిక్ దుర్ఘటనలో ప్రయాణికులందరూ జలసమాధి అయిపోతే.. చిలకా ఘటనలో మాత్రం స్థానిక జాలర్ల సాహసం, తెగువ చాలా మంది ప్రాణాలను కాపాడాయి. అయితే వారు సాహసానికి కొన్ని ప్రశంసలు తప్ప తగిన గుర్తింపు లభించలేదు. తీరానికి కూతవేటు దూరంలో నౌక గొట్టం నాటి భయానక ఘట్టానికి సాక్ష్యంగా కనిపిస్తున్నా, స్థానికులు దాన్ని విహార స్థలంగా వాడుకుంటున్నారు చారిత్రక, పర్యాటక ప్రాంతంగా దాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచన అధికారులకు కలగడం లేదు. – శ్రీకాకుళం డెస్క్

ఒక్కసారి చెలరేగిన మంటలు.. జనం హాహాకారాలు.. ఏం జరిగిందో తెలియని అయోమయ పరిస్థితి. నడిసంద్రంలో వందలాది ప్రాణాలు ఊగిసలాడుతున్నాయి. 15 మంది యూరోపియన్ దేశస్తులతో పాటు వందలాది మంది భారతీయ ప్రయాణికులతో మద్రాస్ నుంచి రంగూన్ వెళ్తోంది ఆ నౌక. సిబ్బంది శక్తి మేర మంటలు ఆర్పేందుకు శ్రమిస్తున్నారు. కానీ మంటలు అదుపులోకి రావడం లేదు. నౌక ప్రధాన అధికారి జార్జ్ మెక్‌డొనాల్డ్ వారిస్తున్నా వినకుండా ప్రాణభయంతో కొందరు నీళ్లలోకి దూకేస్తున్నారు. పడవ చుట్టూ మృత దేహాలు.. అంతా గందరగోళం.. టైటానిక్ షిప్ మాదిరిగా జలసమాధి తప్పదా.. అని అధికారులంతా తలల పట్టుకుంటున్నారు. ఎందుకంటే ఇది జరిగింది.. టైటానిక్ ఘటన జరిగిన కొద్ది సంవత్సరాలకే.. స్థానిక మత్స్యకారులు రంగంలోకి దిగారు. సంప్రదాయ పడవల్లో నౌకవద్దకు చేరుకున్నారు. తీవ్రంగా శ్రమించి ప్రాణనష్టం పెరగకుండా ప్రయాణికుల్ని ఒడ్డుకు చేర్చారు. మత్స్యకారులు సత్తాను చూసిన నౌక అధికారులు ప్రశంసల వర్షం కురిపించారు. రోజులు గడుస్తున్న కొద్దీ నౌక అలాగే సంద్రంలో అడుగునకు చేరిపోయింది. పొగ గొట్టాం మాత్రమే బయటకి కనిపిస్తూ నేటికీ ఆ దుర్ఘటనను గుర్తు చేస్తోంది.

1917 జూలై 1 నాటి సంఘటన అది.
నౌక పేరు చిలకా.
ఘటన జరిగింది జిల్లాలోని సోంపేట మండలం బారువ తీరంలో..
1600 మంది ప్రయాణికుల్లో 81 మంది మృత్యువాత పడ్డారు.
ఈ ఘటనను నాటి పత్రికలు ప్రధానంగా ప్రచురించాయి.



లివిన్ అడ్వెంచర్ బృందం

వందేళ్ల తరువాత..

విశాఖకు చెందిన లివిన్ అడ్వెంచర్ సంస్థ సభ్యుల దృష్టి సాగర గర్భంలో ఉన్న ఈ నౌకపై పడింది. అధ్యయనం అనంతరం సంద్రంలో అన్వేషణ ప్రారంభించింది. 2020 జనవరి 27న ఇన్‌స్ట్రక్టర్ బలరాం నాయుడు, డైవ్ మాస్టర్ రాహుల్, అడ్వాన్స్ డైవర్ లక్ష్మణ్ సముద్రంలో స్కూబా డైవింగ్ చేస్తూ నౌక వద్దకు చేరుకున్నారు. తీరానికి 400 మీటర్ల దూరంలో నౌక ఉన్నట్లు గుర్తించారు. అక్కడ్నుంచి సాగర గర్భంలో 7 మీటర్ల లోతుకు వెళ్లారు. అక్కడ నౌక అవశేషాలను పరిశీలించారు.

ఏమున్నాయి అందులో..

పూర్తిగా శిథిలమైన నౌకలో గోలియత్ గ్రూపర్స్, లయన్ ఫిష్, ఎలక్ట్రిక్ రే, సిల్వర్ మూనీ తదితర రకాల జలచరాలు ఆవాసం ఉన్నట్లు గుర్తించారు. ఇది చాలా ప్రమాదకరమైన ప్రాంతమని.. లివిన్ అడ్వెంచర్ సంస్థ ప్రతినిధి బలరాం నాయుడు 'సాక్షి'కి వివరించారు.

ఓడ కొయ్యి దగ్గర ఆడుకునేదాన్ని..




మునిగిపోయిన ఓడ తీరానికి చాలా దగ్గరగా ఉండేది. చిన్నతనంలో ఆ ప్రదేశంలో ఆడుకునే వాళ్లం. మంటలతో అంటుకున్న పెద్ద ఓడను తీరానికి చేర్చారని మా పెద్దలు చెప్పేవారు. ఇప్పుడు మాత్రం కొయ్య మాత్రమే కనబడుతోంది. – జి.కామమ్మ, బారువ కొత్తూరు

జెండా ఎగురవేస్తాం..



చరిత్రకు సాక్షి ఈ చిలకా ఓడ. అందుకే స్వాతంత్ర్య దినోత్సవం వచ్చిందంటే చాలు జాతీయజెండాను ఓడపై ఎగురవేస్తాం. సెల్యూట్ చేసి దేశభక్తిని చాటుకుంటాం. ఈతరం వారు ఈ ప్రాంతంలో సాహసాలు చేయకపోవడమే మంచిది.
–పెద్దింటి రాజేశ్వరరావు, బారువ కొత్తూరు



నౌక పొగ గొట్టంపై జెండా ఎగురవేస్తున్న స్థానికుడు

డైవింగ్‌కు మంచి ప్రదేశం..



సాగర గర్భంలో ఉన్న షిప్‌ల అన్వేషణ అంటే చాలా ఇష్టం. విజయనగరం జిల్లా చింతపల్లిలో ఓ నౌకను గుర్తించాం. కానీ చారిత్రక ఆధారాలు లభ్యం కాలేదు. బారువ తీరంలోని చిలకా షిప్ గురించి తెలుసుకున్నాం. చరిత్రను అధ్యయనం చేశాం. స్థానికులతో మాట్లాడాం. మత్స్యకారులు, చరిత్రకారుల నుంచి కూడా సమాచారం సేకరించాం. అనుకున్నట్లుగానే తెల్లవారుజామునే సముద్రజలాల్లోకి దిగాం. నేవిగేషన్ రిలేటెడ్ ఎక్విప్‌మెంట్‌తో నౌక వెనుక వైపు మొదటి నేను దిగాను. తరవాత బృంద సభ్యులు వచ్చారు. ఒక వైపు అంతా పూర్తిగా ఇసుకలో కూరుకుపోయింది. డెక్స్ మొత్తం రంధ్రాలు పడ్డాయి. కుడివైపున పరిశీలిస్తే పైప్‌లైన్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొలతలు తీసుకున్నాం. శ్రీకాకుళం జలాలు చాలా ఫ్రెండ్లీ. డైవింగ్ చేసేందుకు మంచి ప్రదేశం. టూరిస్ట్ స్పాట్‌గా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతం. దేశ విదేశీ టూరిస్ట్‌లను అమితంగా ఆకర్షించే ప్రాంతంగా గుర్తింపు లభిస్తుంది.
– బలరాం నాయుడు, రిటైర్డ్ ఇండియన్ నేవీ, సబ్‌మెరైనర్, స్కైడైవింగ్ ఇన్‌స్ట్రక్టర్, స్కూబా డైవింగ్ ఇన్‌స్ట్రక్టర్, అడ్వెంచరిస్ట్

సెలవుల్లో నాన్న తీసుకెళ్లారు..



నాన్నను పడవ మునిగిన ప్రాంతానికి తీసుకెళ్లమని చాలా సార్లు అడిగాను. మొన్న వేసవి సెలవుల్లో మరబోటులో తీసుకెళ్లి మొత్తం చూపించారు. చాలా పెద్ద ఓడ. ఎప్పుడో మంటలతో వచ్చి ఇక్కడ మునిగిపోయిందని చెప్పారు. చూస్తుంటే నాకు భలే అనిపించింది.
–బి.నితిన్, విద్యార్థి, బారువ కొత్తూరు



PANIC ON THE CHILKA.
JUMP OVERBOARD.
RANGOON, Monday.





చిలకా ఓడను రోజూ చూస్తా..



రోజూ చేపల వేట సాగించేందుకు నౌక పక్కనుంచే సముద్రంలోకి వెళ్తాం. బస్సులో సీట్ల మాదిరిగానే లోపల ఉన్నాయి. పెద్ద గదుల వంటి నిర్మాణాలు నేటికీ చూడొచ్చు. పెద్ద పెద్ద ఇనుప పలకలు తుప్పుపట్టి నాచుతో నిండి ఉన్నాయి. పడవ ఆకారం మాత్రం అలాగే ఉంది. చలికాలం వేళ ఒడ్డు నుంచే ఓడ పూర్తిగా కనబడుతుంది. –గొర్లె అప్పారావు, మత్స్యకారుడు, బారువ కొత్తూరు

వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి

టెక్కలి:

పరిపాలన వికేంద్రీకరణతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని వికేంద్రీకకరణ నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖలో పరిపాలనా రాజధానిని స్వాగతిస్తూ టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణితో పాటు నాయకులంతా తమ సంఘీభావం తెలియజేస్తూ పూజల్లో పాల్గొన్నారు. దువ్వాడ వాణి మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తోడుగా నిలవాలని ఆమె కోరారు. విశాఖపట్టణంలో పరిపాలనా రాజధానితో మన ఉత్తరాంధ్ర ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం అధ్యక్షుడు జీవీ రెడ్డి, జేఏసీ ప్రతినిధి సంపతిరావు రామారావు, రావివలస సర్పంచ్ ఎస్.బాలకృష్ణ, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పి.వసంత్‌రెడ్డి,



శ్రీముఖలింగంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న లజపతిరాయ్ తదితరులు

పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎస్.సత్యం, వైస్ ఎంపీపీలు పి.రమేష్, ఎం.కిషోర్, పార్టీ మండల అధ్యక్షుడు బి.హరి పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో..

జలుమూరు: ఉత్తరాంధ్ర అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. శ్రీముఖలింగంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. శివరామకృష్ణన్ కమిటీ ఆధారంగానే వికేంద్రీకరణ జరుగుతోందని, విశాఖ రాజధానిగా సీఎం జగన్ ఆమోదించడాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. గత పాలకుల కారణంగా 60 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయామని, సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం కార్యదర్శి బెవర జగదీష్,ఎంపీటీసీ కె.హరి ప్రసాద్, చింతాడ వెంకటరావు, ఎస్.మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రజలతో మమేకమయ్యేలా..



పార్టీ ముఖ్యులతో సమావేశమైన వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎంలు బూడి, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్

- 26 నుంచి ఉత్తరాంధ్రలో సామాజిక బస్సు యాత్ర
- ఉత్తరాంధ్ర మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులతో వైవీ సుబ్బారెడ్డి, బొత్స సమీక్ష

సాక్షి, విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ వ్యూహరచన చేస్తోంది. దీనిలో భాగంగా బస్సు యాత్రకు ముహూర్తం ఫిక్స్ చేసింది. సామాజిక బస్సు యాత్ర పేరిట రాష్ట్రమంతా పర్యటించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ బస్సు యాత్రను ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణల ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ యాత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన విషయంతో పాటు.. జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మహిళలకు, దళితులకు, వెనుక బడిన వర్గాల వారికి సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు.. వెనుకబడిన వర్గాలకు ప్రధాన పదవులు కేటాయించిన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే భవిష్యత్‌లో మరింత సువర్ణపాలన రానుందని ప్రజలకు వివరించాలన్నారు. ఈ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ నాయకత్వం ఎంత అవసరమో ఈ బస్సు యాత్ర ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పాలవలస విక్రాంత్, మజ్జి శ్రీనివాస్, కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి , వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ట్రాన్స్‌జెండర్లు ఉపాధి అన్వేషించాలి'



ట్రాన్స్‌జెండర్ల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ట్రాన్స్‌జెండర్లు ఉపాధి అవకాశాలు వెతుక్కోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం జిల్లాలోని విద్యావంతులైన ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి మాట్లాడుతూ పట్టభద్రులైన ట్రాన్స్‌జెండర్లు ఉద్యోగాలను అన్వేషించి, సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు. చదువుకోని వారు చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

సారవకోట: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి సమీపంలో శుక్రవారం ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. బుడితి నుంచి బద్రి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం జేసీబీతో కారును పొలాల నుంచి బయటకు తీసుకొచ్చారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా పరమేశ్వరరావు



డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు

టెక్కలి: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావును నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. జర్నలిస్టుగా, ప్రజా సంఘాల నాయకునిగా, ఏపీసీఎల్‌పీ అధ్యక్షునిగా, నౌపడ–గుణుపూర్ రైలు ఉద్యమ పోరాట నాయకునిగా సేవలు అందజేసిన పరమేశ్వరరావు 2010 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జాతీయ కాంగ్రెస్ సభ్యునిగా సేవలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా పేడాడ నియామకంపై పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వీఆర్ఓ ఎంపిక



శ్రీకాంత్

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు గ్రామానికి చెందిన మువ్వల శ్రీకాంత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. వజ్రపుకొత్తూరు మండల పరిధిలో గల నగరంపల్లి గ్రామ సచివాలయంలో ఈయన వీఆర్ఓగా పనిచేస్తున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించి ఈ నెల 16 నుంచి 20 వరకు (ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్) ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. శ్రీకాంత్ నేషనల్ స్థాయి గేమ్స్‌కు ఎంపిక కావడంపై పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎస్ఐ వై.మధుసూదనరావు, డీటీ గిరిరాజ్, ఆర్ఐ పవిత్ర సిబ్బంది అభినందించారు.

ఒలింపియాడ్‌లో పాతటెక్కలి విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: సెమ్స్ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన పాతటెక్కలి ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్ఎం ఎం.ఎస్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. జాతీయ స్థాయిలో 10 మంది విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రతిభా పరీక్ష నిర్వహించగా అందులో వరుసగా 2,4,6,9, 10,11,13,14,15, 23వ ర్యాంక్‌లు సాధించారు. దీంతో ఆదేరోజు కోటబొమ్మాళి ఎంపీడీఓ కార్యాలయంలో సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ రెడ్డి, స్టేట్ కోఆర్డినేటర్ జ్ఞానేశ్వరరావు చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. మళ్లీ శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ శ్రీనివాసరావు అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

• కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రి ధర్మానకు,స్పీకర్ సీతారాం,టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌లకు ఆహ్వానపత్రాలను అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు హాజరు కావాలని స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌లకు కోటబొమ్మాళి వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రాలు అందించారు.

నీలమణి దుర్గ ఉత్సవాలకు వేళాయె

- 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- దసరా రోజు వాహనాలకు ప్రత్యేక పూజలు



నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం

పాతపట్నం:

ఆంధ్రా ఒడిశా సరిహద్దులో పాతపట్నంలో వెలసిన నీలమణి దుర్గమ్మ ఉత్సవాలకు వేళయ్యింది. అమ్మవారిని జిల్లా వాసులతో పాటు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు కొలుస్తుంటారు. ఈ నెల 15వ నుంచి 24వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి.

400 ఏళ్ల చరిత్ర

అమ్మవారి ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో ఈ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంగా ఉండేది. ఒడిశా పర్లాకిమిడిలో ఉన్న మహారాజులు పరిపాలన కోసం ఈ ప్రాంతం, టెక్కలిలో ఉన్న కోటకు వెళ్లేవారని చెబుతుంటారు. 1674 పర్లాకిమిడిని పరిపాలిస్తున్న గజపతి మహారాజుకు చెందిన కూలీలు పొలం దుక్కి చేస్తుండగా అమ్మవారి విగ్రహం దొరికింది. అనంతరం అమ్మవారు మహారాజు కలలో కనిపించి ఆలయాన్ని నిర్మించాలని సూచించడంతో ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని ప్రతీతి.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఈ నెల 15వ నుంచి 24వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు కుంకుమపూజ, కలశపూజ, అష్టోత్తర శతనామపూజలు, హోమాలు జరుగుతాయని, సాయంత్రం 3 గంటలకు సహస్ర నామ పూజ, కుంకుమ పూజ ఉంటాయని ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 15వ తేదీ ఉదయం పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. శరన్నవరాత్రుల్లో ఒక్కో రోజు ఒక్కో అవతారంలో అమ్మవారు దర్శనమిస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



పాతపట్నం నీలమణి దుర్గ దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఒక క్రమ పద్ధతిలో ఆలయంలోనికి పంపడానికి ఏర్పాట్లు చేశాం. పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు కోసం పాతపట్నం, మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు విధులు అందించనున్నారు.

– నూలు ఈశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్

భూ సర్వేపై సమగ్ర వివరణ



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం గురించి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ విశాఖ వేదికగా శుక్రవారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రీ సర్వేలో అనుసరిస్తున్న విధివిధానాల గురించి తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన దగ్గర నుంచి ఆటో మ్యుటేషన్ ప్రక్రియ, ఎల్.పి.ఎం.(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నంబర్ కేటాయింపు వరకు జరుగుతున్న ప్రక్రియ గురించి విపులంగా వివరించారు. గ్రౌండ్ ట్రూథింగ్, వెక్టరైజేషన్ ప్రక్రియ గురించి తెలుపుతూ రైతుల సమక్షంలో సరిహద్దులను నిర్ణయించి రీ సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో జవాబుదారీ తనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మన జాగిలాల పనితీరు అ'ద్వితీయం'



బ్యూటీ, రాణి జాగిలాలను నిమురుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు జాగిలం బ్యూటీకి రాష్ట్రస్థాయి శిక్షణలో ద్వితీయ స్థానం దక్కింది. మంగళగిరి ఆరో బెటాలియన్‌లో ఇంటిలిజెన్సు సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఎనిమిది నెలల పాటు జరిగిన కెన్నెన్ అండ్ డాగ్ హ్యాండ్లర్ పునశ్చరణ ప్రత్యేక శిక్షణలో జిల్లాకు చెందిన పోలీసు జాగిలం బ్యూటీ ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి 35 జాగిలాలు, 54 మంది డాగ్ హ్యాండ్లర్స్ పాల్గొన్నారు. మన జిల్లా నుంచి ఎక్స్‌ప్లోజివ్ శిక్షణలో బ్యూటీ పాల్గొని ద్వితీయ స్థానం సాధించగా నార్కోటిక్ శిక్షణలో రాణి పాల్గొంది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఉదయం పోలీస్ డాగ్స్‌తో కలిసి డాగ్ హ్యాండ్లర్స్ జిల్లా ఎస్పీ రాధికను మర్యాదపూర్వకంగా కలవగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ నేర పరిశోధనకు, నియంత్రణకు, తీవ్రవాద చర్యలను సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన శిక్షణ జాగిలాలకు ఇవ్వడం సంతోషకరమని, జాగిలాల సేవలను సమర్థంగా వినియోగించుకుని జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, రుషి, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ బ్యాగులో నగదు చోరీ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం యూనియన్ బ్యాంక్ వద్ద ఓ పొదుపు సంఘం సభ్యురాలి బ్యాగులో ఉన్న రూ.లక్ష నగదును ఇద్దరు మహిళలు దొంగిలించారు. జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాధితురాలు బాలత్రిపుర సుందరిదేవి పైడిభీమవరం యూనియన్ బ్యాంక్‌లో పొదుపు సంఘ సభ్యురాలు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంక్ నుంచి నగదును విత్‌డ్రా చేశారు. తర్వాత పన్నెండు మంది సభ్యులు బ్యాంక్ పక్క సందులో మెట్లు వద్ద కూర్చుని డబ్బులు పంచుకున్నారు. బాధితురాలు త్రిపుర సుందరిదేవి తన రూ.లక్ష నగదును హ్యాండ్ బ్యాంగ్‌లో పెట్టుకుని సభ్యులతో మాట్లాడుతూ ఉన్నారు. కాసేపయ్యాక ఇంటికి వెళ్లిపోదామని బ్యాగ్ చూస్తే అందులో డబ్బులు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వారికి విషయం చెప్పింది. మరో మహిళ బ్యాగ్ కూడా చిరిగిపోయి అందులో పేపర్లు చిరిగిపోయాయి. కానీ అందులో డబ్బులు పోలేదు. అప్పటి వరకు ఎవరో ఇద్దరు మహిళలు అక్కడే తిరిగారని, వాళ్లే బ్యాగులు కోసేసి నగదు కాజేసి ఉంటారని అనుమానించారు. బ్యాంకు సీసీ కెమెరాలో చూస్తే ఏమీ కనిపించలేదు. శుక్రవారం ఉదయం బాధితురాలు గ్రామ పెద్దల సహకారంతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో వారు పైడిభీమవరం పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించారు. ఒక చిన్న పిల్లాడితో ఇద్దరు గుర్తు తెలియని మహిళలు ఆ సమయంలో సంచరించినట్లు కెమెరాల్లో రికార్డైంది. వారిని పాత నేరస్తులుగా గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

• జయ జయహే



పెద్ద ఎర్రగోవిందపుట్టుగ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని దుర్గమ్మ వేషధారణతో ఆకట్టుకుంది. దసరా శరన్నరాత్రుల సందర్భంగా పాఠశాలలో ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు దేవదాస్‌బెజ్జిపల్లి బాలికకు తర్ఫీదునిచ్చి దుర్గామాత అవతార వైభవాన్ని పిల్లలకు వివరించారు.

– కవిటి

నౌపడ రైల్వేస్టేషన్ సందర్శన



నౌపడ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

టెక్కలి రూరల్: నౌపడ రైల్వే స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీ చేశారు. సీనియర్ అధికారులతో కలిసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో 3, 4వ లైన్ సామర్థ్యం పెంపుదల పని, అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ప్రయాణికుల సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా కోసం స్థలం పరిశీలించారు. అదేవిధంగా పలు రైల్వే హాల్టింగ్ కోసం స్థానికులు వినతిపత్రం అందించారు. ఆయనతో పాటు ఏడీఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఏకే మోతో తదితరులు ఉన్నారు.

స్నేహానికి గుర్తుగా రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొఠారీ గ్రామానికి చెందిన బుడ్డేపు చూడామణి, ఆయన భార్య జయలు మూడేళ్ల క్రితం మృతి చెందడంతో వారి గుర్తుగా తోటి స్నేహితులు ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. శుక్రవారం మూడో వర్ధంతి సందర్భంగా కొఠారీ గ్రామంలో 55 మంది స్నేహితులు రక్తదానం చేశారు. ఒడిశా బెర్హంపూర్‌కు చెందిన ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ ఈ శిబిరం ద్వారా రక్తాన్ని సేకరించారు.

అప్పు తీరుద్దామని వెళ్తే..



చోరీ జరిగిన కాశీబుగ్గ యూనియన్ బ్యాంకు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ యూనియన్ బ్యాంకు వద్ద శుక్రవారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాలిటీకి చెందిన మన్మధరావు అనే వ్యక్తి మధ్యాహ్నం ఒంటిగంటన్నర ప్రాంతంలో యూనియన్ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం విడిపించేందుకు డబ్బు పట్టుకుని వెళ్లాడు. తీసుకెళ్లిన డబ్బులో కొంత మొత్తాన్ని తీసుకుని మిగతా నగదును బండి డిక్కీలో పెట్టి తాళం తీయడం మర్చిపోయినట్లు బాధితుడు తెలిపాడు. బ్యాంకు లోపలకు వెళ్లి డబ్బులు కట్టేసి తిరిగి వచ్చి చూసేసరికి డిక్కీలో ఉన్న నగదు మాయమైనట్లు గుర్తించి లబోదిబోమన్నాడు. స్కూటీ డిక్కీలో ఉన్న రూ.లక్షా పదివేల నగదు, విలువైన పత్రాలను దొంగలు చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని వాహనంపై వచ్చి దొంగతనం చేసి పరారైనట్లు ఆస్పత్రి స్టాఫ్ పోలీసులకు తెలిపారు. చోరీ సంఘటన వాస్తవమేనని బ్యాంకుతో పాటు ఎదురుగా ఉన్న ఆస్పత్రిలో సీసీ ఫుటేజీని పరిశీలించామని నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అమరవీరులను సమాజం మర్చిపోదు



మేరా మట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరరావు, ఏపీసీ జయప్రకాష్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతావని కోసం ప్రాణాలు అర్పించిన వీరులను సమాజం ఎన్నటికీ మర్చిపోదని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్.విజయకుమారి అధ్యక్షతన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరా మట్టి–మేరా దేశ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా దేశభక్తితో మెలగాలని పిలుపునిచ్చారు. సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను గుర్తుచేసుకోవాలన్నారు. వివిధ మండలాల నుంచి సేకరించిన మట్టిని అమృత కలశంలో సంగ్రహించి దేశ రాజధానికి పంపిస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు, వేషధారణలు

ఈ సందర్భంగా పాఠశాలలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల స్మృతి కోసం జాతీయ పతాకావిష్కరణ, అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రాంగణంలో పచ్చదనాన్ని ప్రతిబింబించేలా మొక్కలు నాటారు. మేరా మట్టి మేరా దేశ్‌లో భాగంగా విద్యార్థులు దేశ నాయకుల వేషధారణతో ఆకట్టుకున్నారు. దేశభక్తి గేయాలను ఆలపించి నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జీజీహెచ్ స్కూల్ హెచ్ఎం ఎం.వాగ్దేవి, జీసీడీఓ నీరజ, ఏఎస్ఓ శోభారాణి, జి.జనార్దనరావు, ఏపీఓ నళినీ కాంత్, పలువురు హెచ్ఎంలు, విశ్రాంత టీచర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..?

- రిమ్స్‌లో ఇంజినీరింగ్ అధికారుల అలసత్వం
- నిధులు అందుబాటులో ఉన్నా ఏసీలు రిపేర్ చేయించని వైనం

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం రోగులు, వైద్యుల సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తున్నా వాటిని సక్రమంగా వినియోగించుకోవడంలో విఫలమవుతున్న అధికారులు ఆస్పత్రిలో ఉన్న వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో ఉన్న ఎనిమిది ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు పని చేయడం లేదు. దీనిపై రాతపూర్వకంగా, ఫోన్ ద్వారా, వాట్సప్ ద్వారా ఇంజినీరింగ్ అధికారులకు సమాచారం అందజేస్తున్నా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇచ్చిన నెల రోజులకే ఏసీలు పాడవ్వటానికి కాంట్రాక్టును బాధ్యుడిని చేసి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఇలాగే థియేటర్లలోని ఫ్లోరింగ్ కూడా పాడవ్వటం పరిగణనలోకి తీసుకుంటే ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం తెలుస్తుంది.

ఇన్‌ఫెక్షన్ భయం

రోగులు త్వరగా కోలుకోవాలంటే ఏసీలు ఉండాలి. ప్రస్తుతం ఏసీలు లేకపోవటం వల్ల శస్త్ర చికిత్స జరిపే సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది చెమట పట్టి అనేక ఇబ్బందులు పడుతున్నారు. శస్త్ర చికిత్స జరిపే సమయంలో చెమట కారణంగా రోగికి ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ఈ విషయమై ఇంజినీరింగు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆందోళన చెందుతున్నారు. ఏసీలు పనిచేయని విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర అధికారులు వాటి మరమ్మతులు, కొత్తవి కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేసినట్లు రిమ్స్ అధికారులు చెబుతున్నారు. వీటిని తాము వినియోగించుకునే అధికారం ఉండదని, ఇంజినీరింగ్ అధికారుల ద్వారా పనులు చేయాల్సి ఉంటుందని ఈ కారణంగానే దఫదఫాలుగా వారికి చెబుతున్నా పట్టించుకోవటం లేదని అంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్నోసార్లు నివేదించాం

ఇంజినీరింగు అధికారులకు సమస్యలు ఎన్నోసార్లు నివేదించినా పరిష్కారం కాలేదు. శస్త్ర చికిత్సలు జరపాలంటే రోగికి ఇన్‌ఫెక్షన్ సోకుతుందని డాక్టర్లు భయపడుతున్నారు. నిధులు ఉన్నప్పటికీ ఎందుకు పనులు జరగడం లేదో అర్థం కావటం లేదు.

– డాక్టర్ సుభాషిణి, ఆర్ఎంఓ, రిమ్స్, శ్రీకాకుళం

ఎలక్ట్రికల్ అధికారులు తనిఖీలు చేయాలి

ఏసీలు పనిచేయని విషయం నా దృష్టికి వచ్చింది. మా విభాగంలోని ఎలక్ట్రికల్ ఇంజినీర్లు వచ్చి తనిఖీలు చేయాల్సి ఉంది. వారంటీ ఉంటే కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు చేయిస్తాం. లేదంటే కొత్తవాటి కొనుగోలు కోసం ఆలోచిస్తాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

– సూర్యప్రభాకర్, ఈఈ, ఏపీహెచ్ఎంహెచ్ఐడీసీ,

సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీసీహెచ్ఎస్ జె.భాస్కరరావు

పొందూరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతున్న పొందూరు సీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ డాక్టర్ జె.భాస్కరరావు తెలిపారు. పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆస్పత్రిలో విచారణ జరిపారు. 20 రోజుల కిందట జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన పాముకాటు బాధితునికి చికిత్స చేయకుండా శ్రీకాకుళం పంపించి వేయడంతో మార్గం మధ్యలోనే మృతి చెందాడని, ఎఫ్ఎన్ఓతో మరో రోగికి ఇంజెక్షన్ చేయించడం వల్ల నరాల సమస్య తలెత్తిందని పలు ఫిర్యాదు అందాయి. పాముకాటు బాధితుడి కుటుంబసభ్యులు డీసీహెచ్ఎస్‌కి, జిల్లా ఉన్నతాధికారులకు పొందూరు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రామ్‌దాస్, సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం బాధితులతో చర్చించారు. వీటిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



రవితేజ

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఆడంగి రవితేజ అనే 14ఏళ్ల బాలుడు ఈ నెల 9వ తేదీ నుంచి కనిపించకుండా పోయినట్లు తండ్రి కాళిదాసు శుక్రవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలుడికి చదువుపై అంత శ్రద్ధ లేకపోవడంతో పాఠశాలకు వెళ్లకుండా ఉండిపోయేవాడు. ఇంటిలో దీనిపై ప్రశ్నించడంతో ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లన్నీ వెతికినా లాభం లేకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.